ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

స్వాతంత్య్ర సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్య్ర పోరాటంలో ఆయన చేసిన కృషిని, దేశ ఉప ప్రధానిగా అందించిన సేవలను కొనియాడారు.


వాల్మీకిపురంజగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


మదనపల్లె: రెవెన్యూ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద తహసీల్దార్ నివాళి

మదనపల్లె : సామాజిక, రాజకీయ బానిసత్వంపై యుద్ధం చేసిన ఉద్యమకారుడు బాబు జగ్జీవన్‌రామ్ అని మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ యమలాసుదర్శనం అన్నారు. స్థానిక మాల మహానాడు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో..

వాల్మీకిపురం: మండలంలోని చింతపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలోబాబు జగ్జీవన్‌రామ్ జయంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ అధ్యక్షుడు ప్రభుచరణ్, ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు భారతి, సరిత, దామోదర్, గురవమందారి, విద్యార్థులు పాల్గొన్నారు.

పీలేరులో..

పీలేరు : వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో, వివిధ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక యల్లమంద క్రాస్‌లో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు సహదేవరెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, పార్టీ నాయకులు గిరిధర్‌రెడ్డి, ఆనంద్, చక్రధర్, షాకీర్, కాలనీచిన్న, వివిధ సంఘాల నాయకులు కోళ్లఫారం రమణ, గండికోట వెంకటేష్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

కేవీపల్లెలో..

కేవీపల్లె : బడుగుల బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ అని దళిత సంఘం నాయకుడు ముల్లంగి చంద్రయ్య అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ హరిబాబు, నాయకులు రామచంద్ర, రమణ, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

కలికిరిలో..

కలికిరి : వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో బుధవారం కలికిరి శ్రీనివాసా కళాశాల ఆవరణంలో జగజ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు. వైఎస్సార్‌ఎస్‌యూ నేత నరేష్, అధ్యాపకులు ఉదయ భాస్కర్, రెడ్డెప్ప, ఇమ్రాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం

వాల్మీకిపురం : మండలంలోని చింతపర్తి పంచాయతీ మద్దెలచెరువుపల్లి, చింతపర్తి గ్రామాల్లో గురువారం ఉదయం 6గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ తెలిపారు. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొంటారన్నారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ : పౌర్ణమి పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ–2 డిపో నుంచి అరుణాచలానికి బుధవారం నాలుగు ప్రత్యేక బస్సులు బయలుదేరి వెళ్లాయి. డిపోలో డీఎం ఆర్‌సీ నిరంజన్ పూజలు నిర్వహించి జెండా ఊపి ప్రారంభించారు. ప్రతి నెల పౌర్ణమికి అరుణాచలానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డీఎం తెలిపారు. కార్యక్రమంలో సీఐ గీత పాల్గొన్నారు.

యూనివర్సిటీల్లో పోస్టులు భర్తీ చేయాలి

మదనపల్లె సిటీ : యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి సులూరు చంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక ఏబీవీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యూనివర్సిటీల్లో బోధన, పరిశోధనలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కాల పరిమితి ముగిసిన యూనివర్సిటీలకు పాలక మండలిని నియమించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్య సమితి సభ్యులు సాయిహితేష్, జిల్లా కన్వీనర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

కలికిరి : మండలంలోని స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం వరుసగా మూడవ విడత విడుదల చేసిన వైఎస్సార్ ఆసరా పథకానికి సంబంధించిన చెక్కులను గురువారం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి లబ్ధిదారులకు అందజేస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చింతల రమేష్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని మెయిన్ స్కూల్(తెలుగు) ఆవరణంలో సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

ప్రహరీ నిర్మించండి


కూలిపోయిన మార్కెట్ యార్డు ప్రహరీ

గుర్రంకొండ: స్థానిక మార్కెట్‌యార్డుకు ఓ వైపు కుంగిపోయి కూలిపోయిన ప్రహరీని మళ్లీ నిర్మించాలని రైతులు కోరుతున్నారు. మార్కెట్ యార్డుకు ఏడేళ్ల క్రితం ప్రహరీ నిర్మించారు. కడప–బెంగళూరు జాతీయ రహదారికి పక్కనే ఉన్న గోడ మొత్తం ఓ వైపునకు కుంగిపోయింది. అధికారులు స్పందించి వెంటనే ప్రహరీ నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

రాజకీయ గుర్తింపునకు కృషి చేయాలి

కలికిరి : యాదవ కులస్తులు రాజకీయ గుర్తింపునకు కృషి చేయాలని మండల యాదవ సంఘం నాయకులు అన్నారు. బుధవారం సాయంత్రం కలికిరి క్రాస్ రోడ్డు అంకాలమ్మ ఆలయ ఆవరణలో యాదవులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బీసీలలో అత్యధికంగా ఉన్న యాదవులు విద్య, ఆర్థికంగా అభివృద్ధి చెందినా, రాజకీయాలలో తగిన గుర్తింపు లభించలేదన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు రాఘవేంద్రయాదవ్, కుమార్ యాదవ్, వెంకటనారాయణ, ఈశ్వర్ యాదవ్, రాజేంద్ర, సుబ్రమణ్యం, నాగరాజ, సుధాకర్, మురళి, గంగరాజు, బాలక్రిష్ణ, ప్రహల్లాద తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్తను కలసిన అధికారులు


లోకాయుక్తతో మాట్లాడుతున్న తహసీల్దార్

పెద్దతిప్పసముద్రం : రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి మండలంలోని టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లిలోని స్వగృహానికి వచ్చారు. ఈ సందర్భంగా బుధవారం తహసీల్దార్ విద్యాసాగర్, ఆర్‌ఐ అనీషా, తంబళ్లపల్లి ఎస్‌ఐ రామకృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ పి.శ్రీనాథ్‌రెడ్డి, ఏఎస్‌ఐ గోపాల్ నాయక్, స్థానిక వీఆర్‌ఓ వరదరాజులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట లోకాయుక్త డీఎస్పీ కోలార్ కృష్ణ ఉన్నారు.

నేడు కందుకూరులో బ్రహ్మ రథోత్సవం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరులో వెలసిన శ్రీ పట్టాభిరాముల వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం బ్రహ్మ రథోత్సవం ఉంటుందని నిర్వాహకుడు కరణం ప్రకాశ్‌రావు తెలిపారు. వీరాంజనేయ స్వామి ఆలయంలో కూడా గురువారం కోదండ రామస్వామి రథోత్సవం జరుగుతుందన్నారు.

రేపటి నుంచి యోగ మహోత్సవాలు

మదనపల్లె సిటీ : స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరి కల్యాణమండపంలో 7 నుంచి మూడు రోజుల పాటు ఉచిత యోగ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రామచంద్ర మిషన్, సాంస్కృతిక మంత్రిత్వశాఖల ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8 వరకు, సాయంత్రం 6 నుంచి 8 వరకు ఆసనాలు, ప్రాణాయామం, ముద్రలు, ధ్యానం, యోగిత్ ట్రాన్స్‌మిషన్‌తో ప్రముఖ శిక్షకులతో నేర్పిస్తామన్నారు.

ధనవృద్ధి పథకానికి అధిక వడ్డీ

బి.కొత్తకోట: సప్తగిరి గ్రామీణ బ్యాంకులో ప్రత్యేక డిపాజిట్ పథకం ధనవృద్ధి అమలు చేస్తున్నట్లు స్థానిక మేనేజర్ ఎస్.ఫామీదా తెలిపారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ధన వృద్ధి పథకం కింద డిపాజిట్లు చేసే సీనియర్ సిటిజన్లకు ఎనిమిది శాతం, ఇతరులకు 7.5 శాతం వడ్డీ వస్తుందని తెలిపారు. సాధారణ డిపాజిట్లు చేసే వారికి సీనియర్ సిటిజన్లకు 7.60 శాతం, ఇతరులకు 7.10శాతం వడ్డీ లభిస్తుందన్నారు. దీనికింద గరిష్టంగా రూ.1.50 లక్షల డిపాజిట్ చేసేవారికి ఆదాయపన్ను, 80సీ కింద రాయితీ లభిస్తుందని పేర్కొన్నారు.

నగర పంచాయతీ బడ్జెట్ రెడీ


బి.కొత్తకోట నగర పంచాయతీ కార్యాలయం

బి.కొత్తకోట: బి.కొత్తకోట నగర పంచాయతీ తొలిసారిగా బడ్జెట్ రూపొందించింది. సాధారణంగా నగర పంచాయతీలు, మున్సిపల్, కార్పొరేషన్‌లు ప్రతి ఆర్థిక సంవత్సరం ఆదాయ, వ్యయాలపై బడ్జెట్ తయారుచేసి దానికి అనుగుణంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. 2021 జనవరి నుంచి మున్సిపల్ కమిషనర్ పాలన మొదలైంది. దీంతో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ అంచనాలను సిద్ధం చేశారు. అంచనా మేరకు నగర పంచాయతీకి వివిధ రూపాల్లో రూ.3,83,74,772 ఆదాయం వస్తుందని అంచనా. ఇందులో ఇంటిపన్నులు, భవన నిర్మాణాలకు అనుమతి, స్టాంప్ డ్యూటీ, ట్యాప్, వాణిజ్య లైసెన్సుల పన్నుల ద్వారా ఈ ఆదాయం సమకూతుందని నిర్ణయించారు. ఈ ఆదాయంలో రూ.3,20,93,612 వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఇందులో ఉద్యోగులు, సిబ్బంది, కార్మికుల వేతనాలు, ఇతర అభివృద్ధి పనులకు చేసే ఖర్చును కలిపారు. ఇవికాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే పథకాలు, ఎమ్మెల్యే, ఎంపీ గ్రాంట్ల ద్వారా రూ.10 కోట్ల దాకా నిధులు అందవచ్చని అంచనా వేశారు. దీనిపై కమిషనర్ పలసాని నరసింహప్రసాద్ మాట్లాడుతూ బడ్జెట్ నివేదికను కలెక్టర్, మున్సిపల్‌శాఖ సాధారణ పరిపాలనా విభాగానికి పంపి ఆమోదం లభించాక దానికి అనుగుణంగా నిధుల వ్యయం జరుగుతుందని చెప్పారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

మదనపల్లె : వివిధ ప్రభుత్వ విభాగాల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సంతగేటు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ పారిశుధ్య ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సాధారణ సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలు, హక్కులను హరిస్తున్నాయని, హక్కుల పరిరక్షణకు కార్మికులు నడుం బిగించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నాగరాజు, పృథ్వీరాజ్, వాసు, మధు, రత్నమ్మ, భాగ్యమ్మ, గోపాల్, లోకేష్, ఓబులేసు, శంకర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం


కురబలకోటలో రథోత్సవ దృశ్యం


గుర్రంకొండలో..

కురబలకోట : కురబలకోటలో కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం వైభవంగా సాగింది. జై శ్రీరామ్.. గోవింద.. గోవింద నామస్మరణలతో ఆ ప్రాంతం మార్మోగింది. అందంగా అలంకరించిన తేరుపై స్వామి వారిని ఊరేగించారు. తేరును లాగేందుకు భక్తులు పోటీలు పడ్డారు. యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ : మండలంలోని రామాపురం గ్రామంలో వెలసిన శ్రీ జ్ఞానాభిరామస్వామి వారి రథోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వేకువ జామునే స్వామివారికి గరుడోత్సవం నిర్వహించారు. అనంతరం రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించిన రథంపై స్వామి సతీసమేతంగా కొలువుదీరారు. రామనామస్మరణతో రథోత్సవం కనులపండువగా సాగింది. పలువురు ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు గోపాలభట్టర్, కృష్ణస్వాములు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో రాజన్న రాజ్యం

- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి
- రూ. 5.12 కోట్ల వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ


వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె : జగనన్న పాలనలో రాజన్న రాజ్యం చూడాలనే ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి ద్వారానే వారి కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయనే లక్ష్యంతో అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు మహిళలకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఎన్ని సమస్యలు ఎదుర్కొంటున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మీ తోబొట్టువుగా అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. మహిళా పక్షపాత ప్రభుత్వంగా అక్క చెల్లెమ్మల ఆర్థిక, సామాజిక, రాజకీయ చైతన్యానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి, రుణాలు కట్టొద్దు అని పిలుపునిచ్చి మోసం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వం వలే ఇది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వమని నిరూపించామని తెలిపారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు పారదర్శకంగా అందుతున్నాయని, ఎక్కడా మధ్యవర్తి ప్రమేయం లేదని చెప్పారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుని కుటుంబాలు ఉన్నతంగా రూపొందించుకోవాలని కోరారు. ప్రభుత్వ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం మండలంలో 628 స్వయం సహాయక సంఘాలకు రూ. 5.12 కోట్లు మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ, డీపీఎం ప్రసాద్, ఏరియా కోఆర్డినేటర్ రూతు, ఏపీఎం మంజుల, ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి, వైస్ ఎంపీపీలు వెంకటరమణారెడ్డి, హరిబాబు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కారపాకుల భాస్కర్ నాయుడు, ఆర్‌బీకే చైర్మన్ పెద్దసిద్దయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు సైపుల్లాఖాన్, నాయకులు గజ్జెల శీన్‌రెడ్డి, సి.కె. యర్రమరెడ్డి, సతీష్‌రెడ్డి, వెంకటసిద్దులు, రత్నాకర్‌రెడ్డి, రెడ్డెయ్య, ఎలిశెట్టి వెంకటరమణ, పి. ద్వారకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి ఎమ్మెల్యే సంతాపం

కలికిరి : మండలంలోని పారపట్ల గ్రామం కురవపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయుడు చింతపర్తి ఓబుల్ రెడ్డి మంగళవారం మరణించారు. సమాచారం తెలుసుకున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బుధవారం మృతుని స్వగ్రామం కురవపల్లికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చింతల రమేష్ కుమార్ రెడ్డి, నాయకులు మహేంద్రరెడ్డి, రమణారెడ్డి తదితరులు ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

రూట కృషి అభినందనీయం

కడప ఎడ్యుకేషన్: ఉర్దూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కానికి రూట సంఘం చేస్తున్న కృషి అభినందనీయం అని డీఈఓ రాఘవరెడ్డి కొనియాడారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన రాఘవరెడ్డిని బుధవారం రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్(రూట) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇక్బాల్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు షాహిదుల్లా తదితరులు రూట డైరీ, క్యాలెండర్‌లు బహుకరించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా హౌస్ బిల్డింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి విశ్వనాథరెడ్డి, రూట రాష్ట్ర డైరీ కమిటి కో చైర్మన్ సయ్యద్ సిరాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

మా ఊరికి పేరు పెట్టండి సారూ!


అగ్రహారం పంచాయతీలో పేరులేని ఊరు

పీలేరు : మా ఊరికి పేరు పెట్టండి సారూ అంటూ ఓ గ్రామస్తులు కోరుతున్న అరుదైన సంఘటన ఇది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని అగ్రహారం పంచాయతీ ఆరెంవారిపల్లె సమీపంలో 35 కుటుంబాలు యానాదులు (ఎస్టీలు) జీవనం సాగిస్తున్నారు. ఏళ్ల తరబడి గ్రామంలో జీవనం సాగిస్తున్నా, వారికి సరైన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ కార్డు, రేషన్‌కార్డులలో పక్క గ్రామమైన ఆరెంవారిపల్లె అడ్రస్సు నమోదు చేసి ఉన్నారని చెబుతున్నారు. పలుమార్లు తమ గ్రామానికి పేరు పెట్టాలని అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామానికి పేరు పెట్టడం తోపాటు గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

98 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు


కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

వాల్మీకిపురం: శ్రీ షిరిడిసాయి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షలకు విశేష స్పందన లభించింది. తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 98మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. వీరిలో 30 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు డాక్టర్లు కీర్తన, సమీన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చింతల ఆనంద రెడ్డి, నీళ్లభాస్కర్, మదనమోహన్ రెడ్డి, శంకరాచారి, శంకర, సత్య, గౌరీశంకర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత వీణా విజయరామరాజు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమం కోసం జీవితాన్ని ధారపోసిన మహానుభావుడు వీణా విజయరామరాజ అని మాజీ శాసనమండలి సభ్యుడు కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడపలోని ఎస్టీయూ భవన్‌లో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి అధ్యక్షతన వీణా విజయరామరాజు వర్ధంతిని, బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి , సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, ఏఐటీయూసీ కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

తక్కువ వ్యయం.. సుఖ ప్రయాణం

మదనపల్లె–సికింద్రాబాదుకు నాన్ ఏసీ స్లీపర్ బస్సులు


నూతన నాన్ ఏసీ స్లీపర్ బస్సు

మదనపల్లె సిటీ : ప్రయాణికులను ఆకట్టుకోవడానికి ఏపీఎస్‌ఆర్టీసీ ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఈ క్రమంలోనే మొన్నటి వరకు డీజిల్ నుంచి మార్పు చేసి విద్యుత్ బస్సులను అందుబాటులో తెచ్చింది. ప్రస్తుతం జిల్లాలో తొలిసారిగా నూతన నాన్ ఏసీ స్లీపర్ బస్సులను ప్రవేశపెట్టింది.దూర ప్రాంతాలు ప్రయాణించే వారికి, ప్రధానంగా ఏసీ పడని వారి కోసం జిల్లాలో తొలిసారిగా నాన్ ఏసీ స్లీపర్ బస్సులను ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చింది. వీటికి స్టార్ లైనర్ అని నామకరణం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 62 సర్వీసులను అందుబాటులోకి తెచ్చారు. ఇందులో మదనపల్లె–1 డిపోకు రెండు బస్సులు కేటాయించారు.మొదటి విడతగా మదనపల్లె– హైదరాబాదు–సికింద్రాబాదు సర్వీసును నడపనున్నారు.

సౌకర్యాలివే

బస్సు 2+1 స్లీపర్ కోచ్, 30 కుషన్ సాఫ్ట్ బెర్త్‌లు, సీసీ టీవీ, అగ్నిమాపక పరికరాలు, ఛార్జింగ్ పోర్ట్స్, రీడింగ్ ల్యాంప్స్, లగేజీ ర్యాక్స్, ఆడియో కోచ్.

మదనపల్లె నుంచి అధిక డిమాండు

మదనపల్లె నుంచి హైదరాబాదుకు నాన్ ఏసీ స్లీపర్ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. స్టార్‌లైనర్ ప్రారంభించడంతో ప్రయాణికులను తిప్పుకునే అవకాశం లభించింది. నూతనంగా ప్రవేశపెట్టిన నాన్ ఏసీ స్లీపర్ బస్సులతో ఆదాయం పెరుగుతుందని భావిస్తున్నారు.

పేరు పెట్టి.. రూ.10 వేలు అందుకుని..

నాన్ ఏసీ స్లీపర్ బస్సులకు పేరు పెట్టాలని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు ప్రయణికులకు, ఉద్యోగులకు బంపర్ ఆఫర్ ప్రకటించారు. ఇందులో 3,585 మంది వివిధ రకాల పేర్లు ప్రతిపాదించారు. ఇందులో చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లెకు చెందిన బి.సుమతి ప్రతిపాదించిన 'స్టార్‌లైనర్' అనే పేరును ఎండీ ఖరారు చేశారు. సుమతికి ఇటీవల విజయవాడలో రూ.10 వేల రివార్డును అందించి సత్కరించారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ఆర్టీసీ లక్ష్యమని ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక 1–డిపో కార్యాలయ ఆవరణంలో మదనపల్లె–హైదరాబాదు, సికింద్రాబాద్ నాన్ ఏసీ స్టార్ లైనర్ స్లీపర్ కోచ్ బస్సులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో వెయ్యి కొత్త బస్సులు అంచెలంచెలుగా కొనుగోలు చేస్తామన్నారు. డిపో –1 మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ హైదరాబాదుకు వెళ్లే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిపో –2 మేనేజర్ ఆర్‌సీ నిరంజన్, సీఐలు రేవతి, గీత, ఎంఎఫ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా విద్వాన్ కట్టా జయంతి

రాజంపేట రూరల్ : తెలుగు పండితుడు, కవి, రచయిత, అవధాని, సాహితి పరిశోధకుడు, గ్రంథకర్త, బహుముఖ ప్రజ్ఞావంతుడైన విద్వాన్ కట్టా నరసింహులు 76వ జయంతిని తెలుగు భాషా సంరక్షణ సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫ్యూచర్ మైండ్స్ పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా విద్వాన్ కట్టా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు విద్వాన్ కట్టా ప్రతిభా పాటవాలను కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు పండితులు యాపీ రాయుడు, వై.నందకిషోర్‌గౌడ్, పి.వెంకటరమణ, వి. చిన్నయ్య, పి. వెంకటరమణ, బీవీ నారాయణరాజు, హరిప్రసాద్, సుబ్రమణ్యం, వి.వెంకటసుబ్బయ్య, పి. భారతి, ఎం. హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

8, 9న గంగమ్మ తిరునాల

గాలివీడు: పేరంపల్లి పంచాయతీలో వెలసిన గంగమ్మ తిరునాల మహోత్సవం ఈనెల 8, 9వ తేదీలు శని, ఆదివారాలలో జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం సద్దల కూడు నైవేద్యం అమ్మవారికి సమర్పిస్తారన్నారు. అర్ధరాత్రి అలంకరించిన చాందినీ బండ్లు, కోలాటం, చెక్కభజనలతో నిండు తిరునాలగా మారి భక్తులకు అమ్మవారు దర్శనమిస్తారని చెప్పారు. ఆదివారం ఉదయం బోనాల రూపంలో భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారన్నారు. ఆదివారం సాయంత్రం బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.